కథ

# ములుగర్ర

**ప్రఫుల్లచంద్ర**

**ఉదయం ఎనిమిది. కిరీటి వాలు కుర్చీలో పత్రిక చదువుకుంటూ ఉండగా సుభద్రమ్మ గిన్నెలో పర మాన్నం తెచ్చి "జ్ఞాపకం ఉందా, ఈ రోజు మీ పుట్టినరోజు" అంది మృదువుగా.**

ఆయన పత్రిక మూసేసి ఆమె వైపు తదే కంగా చూస్తూ- "మన పెళ్లయిన కొత్తలో అంటే నలభై ఏళ్ల క్రితం నువ్విలాగే పర మాన్నం తెచ్చి నా ఒడిలో గువ్వపిట్టలాగ ఒదిగి పోయి చెంచాతో తినిపించడం, నేను నీ చుట్టూ చేతులు బిగించి..."

"ఆగండాగండి.." మందహాసం చిందిస్తూ ఆయన్ని వారించి పక్క కుర్చీలో కూర్చుని చెంచాతో పరమాన్నం ఆయన నోటికి అందించింది. కొబ్బరికోరు, ఏలకపొడి దట్టించి బియ్యంతో చేసే పరమాన్నం ఆయనకు పరమ ఇష్టం. భార్య అందిస్తున్న పరమాన్నం తింటూ ఆలోచన ల్లోకి జారిపోయాడాయన.

* * *

ఈ అరవై ఐదేళ్ల జీవనయానంలో ఎన్నో ఆనందాలు, అనుభూతులూ.. వజ్రం లాంటి కొడుకు, రత్నంలాంటి కూతురు, మాణిక్యాల్లాంటి మనవలూ... గత మూడే ళ్లుగా ఒంటరి బతుకే అయినా ఏ చింతా లేకపోయింది గానీ ఆరేడు నెలల నుంచి ఏదో తెలియని వెలితి, ఏదో అశాంతి.

ప్రేమించిన అమ్మాయితోనే కొడుకు వివాహం జరి పారు. కోడలు కూడా కొత్తలో అన్యోన్యంగా ఉంటూ అందరితో చక్కగా కలిసిపోయింది. వారికొక కొడుకు పుట్టాడు. బారసాల జరిగింది. ఆ తర్వాతనే ఊహించని మార్పు.

హఠాత్తుగా ఓ రోజు - పుట్టి పెరిగిన ఊరు విజయ వాడ బోర్ కొడుతోంది హైదరాబాద్‌కి బదిలీ చేయించు కున్నాను అన్నాడు సురేంద్ర. "అద్దె ఇల్లు దొరికాక మీకు తెలియజేస్తాం. వచ్చేయండి" అంది మానస. వజ్రం లాంటి కొడుకు భార్య మెడలోని హారంలో చిక్కుకున్నట్లు అనిపించింది కిరీటి దంపతులకు.

అయితే రెండు వారాలకే ఇల్లు దొరికింది. వీలు చూసుకొని రమ్మని కోడలు ఉత్తరం రాస్తే హైదరాబాద్‌కె ళ్లారు. కానీ విజయవాడలోని ఇంటికి ఎక్కువ కాలం తాళం వేసి ఉంచడం ప్రమాదం. దొంగలు పడవచ్చు. కబ్జా కావచ్చని స్నేహితులు హెచ్చరించడంతో వెనక్కి వచ్చేశారు.

అయితే విజయవాడలోని ఇల్లు కబ్జా కాకుండా రక్షిం చుకున్నా, హైదరాబాద్‌లో కొడుకు ఇంట్లో తమ న్యాయ బద్ధ స్థానం కబ్జా అయిపోయింది. మానస తల్లిదం డ్రులు తమ స్థానంలో తిష్టవేశారు. తర్వాత రెండు నెలలు కోడలు నుంచి డబ్బు వచ్చింది. ఉత్తరాలూ వచ్చాయి. అనంతరం అంతా బంద్.. మూడేళ్ల నుంచి అనంత నిశ్శబ్దం!

పండుగలకూ, పబ్బాలకూ ఇంటికొచ్చే అమ్మాయి, అల్లుడూ తమని వాళ్లింటికి వచ్చేయమని చెబుతూనే ఉంటారు. కానీ కిరీటికిష్టం లేదు. ఆయనకు ఆరు వేలు పెన్షన్. సొంత ఇల్లు ఉన్నాయి. ఎవరి దయాదాక్షి ణ్యాలు అక్కరలేకుండా కాలక్షేపం చేయవచ్చు అనుకు న్నారు. కానీ ఇప్పుడిప్పుడే హృదయంలో శూన్యం మొల కెత్తి ఎదుగుతోంది. అందుకు బీజం ఆరు నెలల క్రితమే పడింది.

అప్పట్లో కిరీటి గుండెనొప్పితో నర్సింగ్ హోంలో చేరవ లసి వచ్చింది. కంగారు పడతారని ఆ విషయం కొడుక్కి, కూతురికీ తెలియజేయలేదు. ఇరుగుపొరుగుల సాయం మాటలకు, సానుభూతికే పరిమితం అయింది. ఇటు ఇంటి పని, అటు నర్సింగ్ హోంలో భర్తకు సేవలు మధ్య నలిగిపోతూ ఆయనకేదైనా అయితే తన గతి ఏమిటని బెంగటిల్లిపోయింది సుభ ద్రమ్మ.

అయితే మూడు రోజుల్లోనే ఆయన కోలుకొని ఐదు వేలు ఖర్చుతో బయటపడి ఇంటికొచ్చేశాక ఆ దంపతుల హృదయాల్లో కొత్త భయాలు చెలరేగాయి. తమకు వయసు మీరుతోంది. ఇంక తరుచుగా ఆరోగ్య సమ స్యలు తలెత్తవచ్చు. చేదోడు వాదోడు లేకుంటే ఎలా?

కొడుకు ఆహ్వానించక పోయినా అభిమానం చంపు కొని వాడి పంచన చేరి శేష జీవితం లాగించేయవచ్చు. కానీ అత్తమామలు వాడింట్లో తిష్ట వేసి ఉన్నారు. తాము అక్కడికి వెళ్తే వాడికీ, తమకూ సమస్యలే. అభిమానంగా పిలుస్తున్నారు కదాని అల్లుని ఇంట తిష్ట వేయడమూ కిరీటికిష్టం లేదు. ఉన్నచోటునే అనుకూలంగా మార్చుకో వాలి కానీ ఎలా?

సాధారణంగా నగరవాసులు ఇరుగుపొరుగులెవరో కూడా తెలియకుండా అంటీ ముట్టనట్టు బ్రతికేస్తూ ఉంటారు. కిరీటి దంపతులూ అంతే. అయితే ఇప్పుడు సాన్నిహిత్యం పెంచుకొని ఒకరికొకరు సహకరించుకు నేట్లు సంబంధాలు మెరుగుపరుచుకోవాలి.

ఈనాటి విద్యా విధానంలో మార్కులు, ర్యాంకులే పర మార్థం అయ్యాయి. సత్ప్రవర్తన, సామాజిక స్పృహ, దేశ భక్తి లాంటివి నేర్పడం మాని మార్కుల వేటలోనే శిక్షణ ఇస్తున్నాయి నేటి పాఠశాలలు. అందుకని కాలనీలోని పిల్లల్ని చేరదీసి రోజూ సాయంకాలం ఒక గంట - వాళ్లకి చిట్టిపొట్టి నీతి కథలు చెబుతూ వాళ్లతో పాటలు, పద్యాలు, దేశభక్తి గీతాలు పాడించాలని నిర్ణయించుకు న్నాడు కిరీటి.

మొదట ఇద్దరు పిల్లలొచ్చారు. వారం రోజుల్లో ఇద్దరు నలుగురయ్యారు. పదిరోజుల్లో పది మంది, నెలాఖరుకు ఇరవై మంది అయ్యారు. కాలక్షేపం కథలకే పరిమితం కాకుండా వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడే విధంగా భారత రామాయణాల్లోని పాత్రల విశ్లేషణ చేస్తూ, పిల్లల చేత ఉపన్యాసాలు ఇప్పించడం, క్విజ్‌లు నిర్వహించి చిన్న చిన్న బహుమతులివ్వడం ప్రారంభించాడు కిరీటి.

కాలనీలోని పిల్లలందరికీ ఆయన తాతగారే.

తాతగారంటే పిల్లలెందుకు పడి చస్తున్నారో తెలుసుకో వడానికి పెద్దలు ఆయనింటికి రావడం, ఆకర్షణీ యంగా ఆయన చెప్పే విషయాలు విని ముగ్ధుల వ్వడం, ఆదివారం అయితే చాలు పిల్లలూ, పెద్దలతో ఆ గది కిటకిటలాడడం పరిపాటి అయింది. దాంతో పరపతి పెరిగి, తమ ఇంట జరిగే శుభకార్యాలకు ఆ దంపతుల్ని ఆహ్వానించడం అడగకుండానే సాయం చేయడం మొదలుపెట్టారు ఆ కాలనీవాసులు. చూస్తుండగానే ఆ కాలనీకే పెద్దదిక్కుగా మారారు కిరీటి దంపతులు.

* * *

భర్తకు పరమాన్నం తినిపించి సుభద్రమ్మ లేచి కిచెన్ వైపు వెళ్తుండగా బిలబిలా పిల్లలూ, పెద్దలూ వచ్చేసి పూలు, పళ్లు, స్వీట్లు ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. ఇంతమంది అభిమానంతో వచ్చి హడావుడి చేస్తోంటే ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయ్యాడు కిరీటి. కాసేపు కబుర్లు చెప్పి అందరూ వెళ్లాక-

"అర్జునా! నీ ముఖంలో ఆ విషాదం ఎందుకయ్యా!"

ఆ స్వరం వినవచ్చిన వైపు ఆశ్చర్యంగా చూశారు కిరీటి దంపతులు.

ఎనభై ఏళ్ల వృద్ధుడైనా ఆరోగ్యంతో మిసమిసలాడు తున్న ఆయన కళ్లలో దరహాసపు మెరుపు. వెండిలాగ

మెరుస్తున్న జుట్టు. పెదవి విరుపులో కొంటె దనం. పంచె, లాల్చీలో హుందాగా కనిపిస్తున్న ఆయన ప్రాక్టీసు కొడుక్కి అప్పగించి తను ప్రజాహిత కేసులకే పరిమితమైన లాయర్ కృష్ణమూర్తి. పెద్దగా పరిచయం లేకపోయినా ఆయన గురించి విని వున్న కిరీటి- నా ముఖంలో విషాదమా! అని ఆశ్చర్యం నటించాడు. సుభద్రమ్మ తెచ్చి వేసిన కుర్చీలో కూర్చుంటూ-

"ఇంతమంది పిల్లలూ, పెద్దలూ వచ్చి అభినందిస్తోంటే నీ ముఖంలో ఆనందంతో బాటు ఉండుండి విషాదమూ ఝలక్ ఇస్తోంది. వీళ్లెవరూ మీ మనవడూ, కొడుకూ రాని లోటును తీర్చలేదు కదా. అయినా నువ్వు పెంచిన చెట్టు మీ కాంపౌండ్‌లో కాక పక్క కాంపౌండ్‌లో కాయలు కాస్తోంటే విషాదమే కదా!" నవ్వేశాడాయన.

కిరీటి దంపతులు గంభీర మౌనం పాటించగా-

"మూడేళ్లుగా ఒక్క దమ్మిడీ అయినా పంపకుండా, ఒక్క కార్డు ముక్కయినా రాయకుండా పండుగలకు, పబ్బాలకు ఇంటికి రాకుండా, జన్మదినాన కనీసం గ్రీటింగ్స్ అయినా పంపకుండా మిమ్మల్ని పూర్తిగా విస్మరించిన మీ సురేంద్ర కళ్లు తెరవాలంటే, తన బాధ్యత తెలుసుకోవాలంటే పరిహారం కోరుతూ మీరతని మీద కేసు పెట్టాలి. ఈమధ్య కోర్టులు కూడా అలాంటి కొడుకులకు బుద్ధి వచ్చేట్టు తీర్పు చెబుతున్నాయి" అసలు విషయం భళ్లుమన్నాడు కృష్ణమూర్తి. "మొత్తానికి లాయర్ బుద్ధి పోనిచ్చుకున్నారు కాదు" అనాలనుకొని కూడా అనలేకపోయాడు కిరీటి.

"మీ అబ్బాయి మంచివాడే కావచ్చు. కానీ నిద్రపోతున్నాడు. నిజానికి చాలా మంది అంతే. తమ పనులకు నిరసన వ్యక్తం కాకపోతే అంతా బాగానే ఉందనుకొని నిద్రలోకి జారిపోతారు. ములుగర్రతో పొడిస్తే గానీ అలాంటి వాళ్లకు బుద్ధి రాదు. సమస్య అర్థం కాదు" అంటూ చిననాటి అనుభవం చెప్పాడు కృష్ణమూర్తి.

"ఆ రోజుల్లో పల్లెల నుంచి అర్థరాత్రి కూరగాయల బస్తాలతో ఎడ్లబళ్లు బయలుదేరి తెల్లవారేసరికి పట్నం మార్కెట్‌కి చేరుకునేవి. బండి బయలుదేరిన కాసేపటికే బండి తోలే నాయుడు నిద్రలోకి జారిపోయినా ఎద్దులు మాత్రం నెమరేసుకుంటూ పక్క చూపులు చూడకుండా నేరుగా బళ్లను మార్కెట్‌కి లాక్కుపోయేవి. వెనుక నుంచి



"ఎవరైనా సరుకు దొంగిలించినా, బండిని పక్కదారి పట్టించినా వాటికి తెలిసేది కాదు. సరుకు మాయమైనా, బండి పక్కదారి పట్టినా అందుకు బాధ్యత ఎవరిది?" అడిగాడు కృష్ణమూర్తి.

"బండి నాయుడిదే. అతగాడు మెలకువగా ఉండి సరుకుపోకుండా చూడాలి. ఎద్దులు పక్కదారి పడితే ములుగర్రతో పొడిచి సక్రమ మార్గంలో పెట్టాలి" చెప్పాడు కిరీటి.

"మరి నువ్వెందుకాపని చేయవు?" కృష్ణమూర్తి ఠక్కున అడగ్గా తెల్లబోయాడు కిరీటి.

"మీ అబ్బాయి తప్పుదారి పట్టడానికి- సకాలంలో నువ్వు ములుగర్రతో పొడవకపోవడమే కారణం అర్జునా! చెప్పేది, చేసేదీ అంతా నేనే. నీవు నిమిత్తమాత్రుడివి. కేసు పెట్టి ములుగర్రతో ఒక పోటు పొడువు" శ్రీకృష్ణుడు గీత బోధించిన ఫోజు పెట్టాడు కృష్ణమూర్తి.

కానీ కొడుకు మీద 'లా' అస్త్రం ప్రయోగించడానికి ఒప్పుకోలేదు కిరీటి. అయితే హితులు, సన్నిహితులతో యుద్ధం చేయనని అస్త్ర సన్యాసం చేసిన అర్జునుని వదిలి పెట్టాడా ఆ కృష్ణుడు!?

★ ★ ★

ఒక సోఫాలో సురేంద్ర, మానస. ఎదుటి సోఫాలో సుందరీ, కామేశ్వర్రావూ. సురేంద్ర చేతిలో ఏవో కాగితాలు.. వాతావరణం నిశ్శబ్దం.. గంభీరం..

చివరకు కామేశ్వర్రావు అన్నాడు. "కోర్టు వ్యవహారాల్లో ఢక్కా మొక్కీలు తిన్న నేను చెబుతున్నా అల్లుడూ! ఆ లాయర్ నోటీస్ బెదిరించడానికే గానీ నిజంగా కోర్టుకెళ్లాలని కాదు. మీ నాన్నకు డబ్బు పిచ్చి పట్టినట్టుంది. నెల నెలా నువ్విచ్చే ఐదువేలుకి నేనే స్వయంగా బ్యాంకెళ్లి డ్రాఫ్టు తీసి పంపుతోంటే అది చాలలేదంటూ కన్నకొడుకునే బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడంటే ఏమనుకోవాలి?"

"మీరు కోర్టు కేసుల్లో ఢక్కామొక్కీలు తిని ఉండొచ్చు. కానీ నేను లా చదివినవాడిని. నాన్న పేర్కొన్న సెక్షన్ ప్రకారం వాళ్లకి వెయ్యి రూపాయల కంటే ఎక్కువ ఇవ్వనక్కరలేదు. మనం ఐదు వేలు పంపుతోంటే ఒక్క వెయ్యి కోసం ఎందుకు నోటీస్ పంపుతారు? మీరసలు డబ్బు పంపుతున్నారా, లేదా?"

ఒక్కసారిగా రెచ్చిపోయిన అల్లుని రౌద్రాకారం చూసి ఖంగు తినేశాడు కామేశ్వర్రావు. సురేంద్ర ఆయన్ని అనుమానించడం అవమానంగా తోచిన మానస, సుందరి మందలించినా సురేంద్ర పట్టించుకోలేదు. "రశీదులు చూపించండి" గద్దించాడు. కామేశ్వర్రావు మాట్లాడలేదు.

"సరే బ్యాంక్‌కి వెళ్లి కనుక్కుందాం, వస్తారా?" నిలదీశాడు.

కామేశ్వర్రావుని చూడగానే అసలు విషయం అందరికీ అర్థం అయిపోయింది.

"సిగ్గు లేకుండా అల్లుడి ఇంట్లో పడి మెక్కుతూ, దొంగచాటుగా మనవడి చేతిలోని బిస్కెట్లు లాక్కుని తినే నువ్వా మా నాన్నని విమర్శించేది. మా నాన్నకి డబ్బు పిచ్చి లేదురా! మిమ్మల్ని నమ్మి అంతా సవ్యంగానే ఉందని భ్రమపడి నిద్రపోతున్న నా కళ్లు తెరిపించడానికే ఆయన ఈ నోటీసు పంపారు. ఈ ఇంట్లో ఉండే హక్కు వాళ్లకే ఉంది, మీకు కాదు! సిగ్గూ, శరం ఉంటే తక్షణం ఇంట్లోంచి బయటకు పోయి మీ పెన్షన్‌తో బతకండి. నెలనెలా ఐదు చొప్పున ఈ మూడేళ్లలో నువ్వు నొక్కేసిన లక్షా ఎనభైవేలు అక్కడ పెట్టి మరీ కదులు" ఏకవచనంలో నిప్పులు కురిపించాడు సురేంద్ర.

ఆ భీకరాకారాన్ని చూసి హడిలిపోయి అందరూ మ్రాన్పడిపోగా అందరివైపూ తీక్షణంగా చూస్తూ తనే బయటకు పోయాడు సురేంద్ర. చేష్టలుడిగిన ఓ క్షణ నిశ్శబ్దం తర్వాత తల్లీకూతురూ ఏకమై కామేశ్వర్రావుని తిట్టిపోశారు. సిగ్గుతో చిదిగి పోయిన ఆయన ఎలాగైనా అల్లుడిని శాంతింప జేయమని కూతుర్ని బ్రతిమాలుకున్నాడు.


అలా వెళ్లిన సురేంద్ర రెండు గంటలు గడిచాక తిరిగొచ్చి ఎవరితోనూ మాట్లాడకుండా గంభీరంగా బెడ్‌రూంలోకి వెళ్లిపోయాడు. అతనితో మాట్లాడడానికి ధైర్యం చాలని సుందరి, కామేశ్వర్రావులు కూతుర్ని బెడ్‌రూంలోకి పంపారు. ధైర్యం కూడదీసుకుని లోనికెళ్లిన ఆమె భర్త పక్కనే మంచం మీద కూర్చుంది.

అతని కళ్లలో ఆరని ఆవేదన. ఆమె ముఖంలో తీరని పశ్చాత్తాపం.

కాసేపు మౌనమే ఇద్దరి భాషా... ఆ తర్వాత

"మనం ఎప్పుడు దారి తప్పాం, మానసా? మన సంసారం మునుపటిలాగ లేదెందుకని" అతని స్వరంలో బాధ... ఆమె మాట్లాడలేదు.

"ప్రేమించుకున్నాం. వివాహం అయ్యాక విశ్వాన్ని జయించినంత సంబరపడ్డాం. సినిమాలు, షికార్లు, హోటల్ భోజనాలు, పిక్నిక్‌లతో ఒక సంవత్సరం హాయిగానే గడిచింది. నా తల్లిదండ్రులు మనకెంతో సహకరించారు. నువ్వు కూడా వారినెంతో గౌరవించావు. కానీ తర్వాత ఏమయింది మానసా!" అతని గొంతు జీరబోయింది. ఆమెకు దుఃఖం ముంచుకొచ్చింది. జ్ఞాపకాలు తెరలు తెరలుగా... ఆమె తలవంచుకుంది.




అశరీర ఆకాశవాణిలా అతని స్వరం వినిపిస్తూనే ఉంది. "హైదరాబాద్‌కి వెళ్లిపోదాం అన్నావ్. ప్రేమించిన భార్య మొదటి కోరిక. సరే అన్నాను. అన్న తగిలేశాడంటూ నీ తల్లిదండ్రుల్ని తెచ్చి పెట్టావ్. తర్వాత నీలో మార్పు..."

గతాన్ని తవ్వుకుంటూ కాసేపాగి-

"ఏ టిఫిన్ చేయాలి? ఏం వండాలి? ఏ చీరకట్టుకోవాలి? అని అడిగి మరీ చేసే నువ్వు మీ తల్లిదండ్రులు రాగానే నన్ను పట్టించుకోవడమే మానేశావ్. నీ తల్లిదండ్రుల నిర్ణయమే నీకు శిరోధార్యం అయింది. డైనింగ్ టేబుల్ మీద నాకిష్టం లేని టిఫిన్, కూరలూ ప్రత్యక్షమవుతున్నాయి. మన చుట్టూ ఉన్న ప్రేమరహిత సంసారాల్లాగే మన సంసారమూ తయారైంది. ఏమయిపోయింది ఆ ప్రేమంతా? ఎక్కడికి ఎగిరిపోయింది? తల్లిదండ్రుల్ని నిర్లక్ష్యం చేస్తున్నాడంటూ మీ అన్నని మీ బంధువులంతా తిడుతున్నారని చెబుతూ ఉంటావ్. నా బంధువులు కూడా నన్ను అలాగే తిట్టే పరిస్థితి తెచ్చిపెట్టావ్. పెళ్లికాక ముందు సమున్నత వ్యక్తిత్వంతో విశాల భావాలతో నన్ను ఆకర్షించావు. ఏమయిపోయాయి ఆ వ్యక్తిత్వం, ఆ భావాలు? అదంతా నటనా? ఇవన్నీ చాలా చిన్న విషయాలనీ, వాటిని పట్టించుకోకుండా ప్రేమను బ్రతికించుకోవాలనీ సర్దుకుపోతున్నా. చూసీ చూడనట్టు ఊరుకున్న. చివరకు.. చివరకు.. మోసానికి కూడా పాల్పడ్డావు. కుట్రలు, కుతంత్రాల టీవీ సీరియల్ సంసారాల స్థాయికి దిగజార్చావు మన సంసారాన్ని" అతని స్వరం గిజగిజలాడింది. ధారగా కన్నీళ్లు. ఆమె కంటా కన్నీరే.

"అంత మాట అనకు సురేంద్రా! నేను మోసం చేయలేదు. మా నాన్న మోసం చేస్తున్నట్టు నిజంగా నాకు తెలియదు. నాకేదో దయ్యం పట్టింది కాబోలు. నిన్ను నిర్లక్ష్యం చేశాను. నేనేం చేసినా నీ నుంచి వ్యతిరేకత లేకపోవడంతో నీకు సమ్మతమే అన్న భ్రమలో దారి తప్పాను. సారీ..సారీ.." లెంపలు వేసుకుంది.

ఆమె వైపు తదేకంగా చూస్తూ "నేను రేపు విజయవాడకెళ్లి నాన్నగారి పాదాల మీద పడి క్షమాపణ కోరుకోవాలనుకుంటున్నా" అన్నాడు స్థిరచిత్తంతో.

"నేనూ వస్తాను" చటుక్కున అంది మానస. అయినా అతని ముఖంలోని గాంభీర్యం సడలలేదు.

"మన డబ్బు వసూలు చేసి అమ్మానాన్నల్ని పంపేస్తాను. ఇకపై మన సంసారం ప్రేమసుధాసారమే. ప్రేమరహితం కానేకాదు, కానివ్వను." అంది ఆర్తిగా.

ఆమెను దగ్గరగా తీసుకున్నాడు సురేంద్ర.

అంత బాగానే ఉందన్న భావనతో ప్రభుత్వాలే పడిపోయాయి. ఇంక సంసారాలెంత! ఫీల్ గుడ్ భావనతో కళ్లు మూతలు పడకుండా అడపాదడపా ములుగర్రతో పోట్లు అవసరమే!

✤